# నైతికకాంతి

రామయ్య తూర్పునుంచి అనగా అనకాపల్లి ఆ ప్రాంతంనుంచి వలస వచ్చి రాజానగరం ఈ ప్రాంతాన్ని కాపురముండిపోయి పని చేసుకునే కమ్మరిపనివాడు. ముసలివాడు అయినా పని పాటల్లో మంచి చాకచక్యంగలవాడు. బండి చక్రాలకు పట్టాలు వేయడం, నాగళ్ళకు కఱుకోలలు దిగెయ్యడం, ఇలాంటిపనులు అవలీలగా చేసేస్తూ వుంటాడు.

వయస్సులో రాత్రిం బవళ్ళు కొలిమెప్పుడూ ఆరిపోకుండా తన కృషిలోనే మెలగేవాడు వయస్సుహెచ్చిన యీ మధ్య అతడు రాత్రిళ్ళు పనిమానివేసి " కృష్ణా రామా " అనుకొంటూ ఇంటివద్దనే వుండిపోతూ వచ్చేడు.

రామయ్యయొక్క కమ్మరిమకాంకు సరిపోయినన్ని బొగ్గు బస్తాలు బస్తావెనకాల బస్తా తెచ్చి పగలల్లా పడెయ్యడం పని బూసెమ్మ అనే పనికత్తెది—బూసెమ్మకు వేరే మరోచోట పనిలేదు. పొద్దున్నే వచ్చినకాణ్ణుంచి బొగ్గుబస్తాలు మోస్తుం దేమో, మొదటి బస్తా మోతకాణ్ణుంచే శరీరం నల్లబారడం ప్రారంభించి సాయంకాలం అయ్యేసరికి ఎలావుంటుందీ దాని వొళ్లు—కళ్ళక్కాటుకక్కర్లేదనిపిస్తుంది, కొప్పూ వెనుపూసా వొకటేరంగు అనిపిస్తుంది, గుడ్డలవాలకం చూస్తే కాకిరెక్కల్లా దులుపుకుంటూ వుంటుంది. పొద్దుటి రూపు అంతా మారిపోతుంది, ఆ పనిచేసి మళ్ళీ యింటికిపోయి వెచ్చన్నీళ్లుపోసుకొని బయట పడేదాకా—

ఇలా వుంటూంటే ఓ పొద్దేం జరిగింది అంటే-రామయ్యకు ఆ రాత్రితో ఆయువు సరిగామోసు పాపం!—రోజూలాగే

పొద్దు కూకిపోతూంది, రామయ్య పాకాలో కొలిమి చల్లారు తుంది కూస్సేపటికో కాస్సేపటికో యింక.—బూసెమ్మ ఓబొగ్గుల బస్తా తెచ్చి నేల పడెయ్యబోతూంది అదే ఆఖరిబస్తా ఆనాటికి. ఇంకా పడెయ్యకుండానే రామయ్య తన పక్కనేకూకున్న కుఱ్ఱ కాపుని—"బాబా! దానికా బస్తా కిందకు దించుమా—ధిమ్మన పడేస్తే బొగ్గు నలి అయిపోతుంది" అన్నాడు. అ చెప్పిందే తడవుగా కుఱ్ఱకాపు బూసెమ్మదగ్గఱకెళ్ళి ఆ బస్తా ఆలా ఓ పక్క రెండుమూలలూ పట్టుకుని మెల్లిగా దింపేడు. ఆ దింపడంలో బూసెమ్మ వొంటియొక్క సందు సందుల పసందులేం కనిపెట్టేడో "బూసెమ్మా! నీ వళ్ళు అసలు సిసలైన గట్టి బంగారమేనేవ్!" అన్నాడు. ఎఱిగుంటే ఎఱిగుండిపుండవచ్చును అంతకుముందు కొంచెందాన్ని అతడు. "అయితే అంది?" బూసెమ్మ కుసంత గొంతు సన్నగించుకుని. "మాపటికి ఈ పాకాలోకి—" అన్నాడు. బూసెమ్మ ఊఁకుకుంది—మన మప్పుడే బూసెమ్మ చెడ్డమనిషి అనిగాని మంచిమనిషి అనిగాని అనడానికి వల్ల లేదు—బూసెమ్మ ఊఁకుకుంది. ఊఁకుకుంది అంటే అదే సమ్మ తించినట్టుగా అని కాపుకుఱ్ఱడనుకున్నాడు.

రామయ్యతాత కనిపెట్టాడు ఆ సంగతి. తాతలాగున్నా రామయ్య ఎక్కువ నీతి వాసన గలవాడు, కొక్కోకశాస్త్రం చదివినవానికి మల్లే ఏజాతి స్త్రీకి ఏజాతి పురుషుడికీ ఎట్టివాక్కు జరిగినా అట్టే కనిపెట్టే రకంగాడు. అనుకున్నాడు తక్షణం "అరి! నా పాక యిలాంటి అవినీతి పనులకు చోటిస్తూంది కామోసు నేను రాత్రిళ్ళు కొలింపనికి నీళ్లొదులుకున్న కాణ్ణుంచి? ఇన్నాళ్ళనుంచి ఎన్నెన్నిపాపాలు జరిగినాయోగదా! ఈ పాకలో

ఈ బూసెమ్మ బుద్ధిగలదేనే? వీడు రమ్మన్నంత మాత్రంచేత వచ్చేస్తుందా? పిల్ల చెడిపోయేటట్టుందే? మిడత అగ్నిగుండంలో పడిపోయేటట్టుందే?" అని అట్టే యోజించాడు. "వెల్లడిగా వాళ్ళిద్దర్నీ అడిగేస్తే అది మఱీ ప్రమాదం, నిరపరాధులవుతారేమో తుదకు!" అని ఆ రేత్రి పాపం ఆ తనపాకాలో జరక్కుండా వుండే వుపాయంకోసం పంతగంచిపోయేడు. వాళ్ళను అనగా ఆ బూసెమ్మనూ కాపుకుఱ్ఱణ్ణీ అలా వెళ్ళనిచ్చాడు. తాను తన కొలిమిలో కొత్తబొగ్గోశాడు. ఉన్నపనీ లేనిపనీ కల్పించుకుని అదేపనిగా కొలిమికి తిత్తి వూత్తూ అగ్ని జ్వాలింపజేశాడు.

రామయ్యవూహ ఏమిటీ? వాళ్ళురాక మానరని, వచ్చేసరికి తనపాకాలోని కొలిమి వెలుగు అలా వెలుగుతూన్నట్టయినా ఆ వెలుగులో ఏ పాపప్పనీ జరగబోదనీ—అలా వూహచేశాడు.

అతని వూహలో కొంతవఱకూ భవిష్యదర్థం వుండక పోలేదు—బూసెమ్మను మఱెక్కడికెళ్ళినా తప్పట్టుకుంటారు ఆ వూళ్లో. తాత పాకకు వెడితే పనికోసం వెళ్ళింది మఱోలందుకు కాదనుకుంటారు, అంచేత బూసెమ్మకు ఏవేళప్పుడైనా సరే రామయ్యతాత పాకకు వెళ్ళడం అంటే రాజాబహద్దర్ బాట. ఇఖకాపుకుఱ్ఱడు మొదటే చెడిపోయిన ధృతరాష్ట్ర సంతతిలో వాడవడంచేత ఎక్కడకు ఏవేళప్పుడు వెళ్ళినా వొకటేవాడిక—నదురూలేదు బెదురూలేదు.

సరిగా ఆ మాపు పదిపదకొండు గంటలకు బూసెమ్మ ప్రభల్లే తేర్చి దిద్దుకుంది. జాతిరత్నంలా మెఱుస్తూ "తాత పాకలో వుండ" దనుకుని వెళ్ళింది. వెళ్ళీవెళ్ళకుండానే దాని

వస్తువులమీదకు తాతయొక్క అగ్గికొలిమి బగ్గుబగ్గు మండుతూ వెలుగోసింది. వేటేమూల కాపుకుఱ్ఱడు "వచ్చింది నా బూశమ్మ! ఈ తాత చచ్చిపోనైనా చచ్చిపోయినాడుకాడు. ఇంకా కొలిం వూదుకుంటూ చచ్చిందాకా ఇదేపనిగా మండిపోతున్నాడు." అని పళ్లు కొఱికేస్తున్నాడు.

రామయ్యతాత వాళ్ళ యిద్దర్నీకూడా కనిపెట్టేడు. కని పెట్టి "వచ్చారే వాళ్ళు!" అని మఱింత దృఢిమతెచ్చుకుని "నా పాకలో ఈ అవినీతి జరక్కూడదు" అని గట్టి పట్టుపట్టి నట్టు కొలిమింకా ఊత్తూ ఆ మేకూ ఈ మేకూ సాగేస్తూవున్నాడు.

రామయ్యతాత ఓపికతెచ్చుకుని కొలిమింకా జ్వాలింప చేస్తూ పాకఅంతా తేజోవంతం గావిస్తూ వుంటే—కాపుకుఱ్ఱ డోపికపట్టలేకుండా వున్నాడు. ఎదూరుగా—మాట్లాడ్డానికి శక్యం గాకుండా—దూరంగా—అల్లంతలో బూసెమ్మ తనయొక్క బంగారు పుట్టుచాయతో, వస్తువులు పెట్టుకుని కళ్ళువిప్పుకొని తన్ను "రా! రా!" అన్నట్టు గోచరిస్తూ వుంది. తాత అక్కడ పనిచేస్తూ వున్నంతసేపూ, తాతయొక్క కొలిం కాంతిల్లుతూ న్నంతసేపూ, కుఱ్ఱడూ బూసెమ్మా ఏకంగావడం కలలోనివార్త!

ఏకాలానికి ఏ పుఱ్ఱెకు ఏంబుద్ధి పుడుతుందో! హరిహరీ! కాపుకుఱ్ఱడు ఆపాకలోవున్నటువంటి ఒక పెద్దగునపం అమాం తంగా తాత వెన్నెముకను గ్రుచ్చుకుపోయేటట్టు విసరి "చచ్చాన్రో!" అని తాత అఱిచేసరికి పాఱిపోయినాడు.

బూసెమ్మ నిర్విణ్ణురాలైపోయింది. "తాతా! తాతా! రామయ్యతాతా! ఇక నీతో నా జీవనాధారం సరి. ఇకనీతో నా జీవనాధారం సరి" అని ఏడుస్తూ పెద్దరోదనం చేస్తూ

ఆ ప్రజ్వరిల్లుతూవున్న కొలిమిమ్మీదికి పడిపోయింది. కొలిమి చల్లారి పోయింది. నిజంగా బూసెమ్మయొక్క కన్నీళ్ళుపడి కొలిం చల్లారిపోయింది.

ప్రజలు గబగబావచ్చి బూసెమ్మను ఇవతలకు లాగి బ్రతికించగలిగేరుగాని రామయ్య అన్న ఆ కమ్మరి పనివాణ్ణి, ఆ శతవృద్ధుని, బ్రతికించ లేక పోయినారు.

తరువాత ఆ హత్యనుగురించి "కేసు" అయి "ఆకేసు" "కమిట్టై" విచారణ అయిందో లేదో మనకు తెలియదుగాని మనకు తెలిసిన సంగతిఇది. ఆ హంతకుని మొగం బూసెమ్మ మళ్ళీ చూడలేదుట.

చీకటిపడ్డప్పుడల్లా తాతయొక్క కొలిం కాంతి కళ్ళకట్టి నట్టై కళ్ళు మూసికొని "అదేంకాంతి?" అనీదట.

.... .... .... .... ....

## నిరుద్యోగంలో గూడా ఇన్నిదారులున్నాయా!

"సిటీబస్" రావడం ఆలస్యం అయింది. ఆలస్యం అయింది, అనేకంటె అసలు నేనక్కడ కూర్చున్నంతసేపూ అని అంటే నిజమేమో? నేనోగంట దానికోసం కాసుకూర్చున్నాను. కాని రాలేదు. దేనికోసం? తమరు ఇక్కడకూర్చునివున్నారు "అని ఎవరైనా ప్రశ్నిస్తేమాత్రం తమకోసమేనండీ!" అని కబుర్లు చెబుతూ కాలక్షేపం చేసేసాను ఆ గంటాను—నా మూరేండ్ల జీవితంలోనూ ఒకగంట గడచిపోయినది కదా ఇతరులతో కబుర్లు చెబుతూ నని సంతోషించాను. వేళ అది సాయంకాలం 3-30